స్కెచ్

# పేదల పార్టీ అభ్యర్థి

వి. ఎన్. ఆచార్య

పేపరు తలక్రిందుగా చదివేసిన రంగయ్య ఒక్కసారి ఉత్సాహంతో లేచి నుంచున్నాడు తలక్రిందుగా అంటే క్షుణ్ణంగా అనే కాని నిజంగా తలక్రిందుగా కాదు రంగయ్యకు కళ్లు బాగానె కనిపిస్తాయి - కిట్టనివాళ్ళు అతనికి చూపు తక్కువని ప్రచారం చేసినా కళ్లజోడు వేసుకుని చీమలాంటి చిన్న అక్షరాల్ని ఇట్టే చదివెయ్యగలడు రంగయ్య

ఎలెక్షన్లు వస్తున్నాయని ఎవరో అన్నారు కాని ఇంత త్వరగా వస్తాయని రంగయ్య అనుకోలేదు. వచ్చేశాయని పేపర్లో రాశారు చాల రోజులనుంచీ ఎలెక్షను కోసం కాచుకు కూచున్నాడు రంగయ్య ఆ జిల్లాలో రంగయ్య పోటీ చెయ్యని ఎలెక్షను వుంటే జిల్లా ప్రజలకే అవమానం కాని రంగయ్యకు కాదు మిత్రరాజ్య సమితి సభ్యత్వం నుండీ మునిసిపల్ కౌన్సిలర్ వరకూ అన్ని ఎన్నికలకూ రంగయ్య నామినేషన్ ఒకటి వుండి తీరాల్సిందే దానిలోని లాభనష్టాలు రంగయ్యకూ అతని నమ్మిన అనుచరుడు సుబ్బారాయుడుకీ మాత్రమే తెలును! అతను ఏ ఎలెక్షనులోనూ గెలవక పోవడం అతనికేం అంత నష్టకరం కానప్పడు ఎన్ని ఎలెక్షన్లయితే మాత్రం ఏం?

రంగయ్యా, సుబ్బారాయుడూ మరునాడే అన్నిపార్టీల వాళ్ళదగ్గిరకీ తిరిగారు అభ్యర్థిత్వం కోసం నిజానికి ఇన్ని ఎలెక్షన్లల్లో నిలబడినా రంగయ్య ఏదో ఒక పార్టీలో వుంటే ఎప్పడో ఏదో అయివుండేవాడని వూళ్ళోవాళ్లు కిట్టక అంటుంటారు. ఏ పార్టీకీ చెందకుండా అందరి చేతా పనులు చేయించుకొనడంలో వున్న తెలివి తేటలు రంగయ్యకు తెలిసినంతగా వాళ్లకి తెలీదు

రంగయ్య పూర్వం జస్టిస్ పార్టీలో వుండేవాడు తహశీల్దారు దగ్గిర్నుండీ గ్రామమునసబు దాకా అందరూ అతన్ని గౌరవించేవాళ్లు అతని పనులు చక్కగా అయ్యేవి కిట్టనివాళ్లు ఏదో స్వంత లాభం కోసం అధికార్ల చుట్టూ తిరుగుతుంటాడని రంగయ్యని అన్నా — అది తన స్వంత విషయం గనక - రంగయ్య త్యాగానికేమీ కొదువలేదు తన కులం వాళ్లకు ఎన్ని ఉద్యోగాలు ఇప్పించాడు? తర్వాత కాంగ్రెసులో చేరాడు, దేశానికి స్వతంత్రం వచ్చేసింది గనక ఇందులో రంగు ఫిరాయించడం ఏముందీ అని బల్ల గుద్ది అడుగుతాడు రంగయ్య అదేదో ఎలెక్షనులో పేదవాళ్లందరూ తన్ని కావాలంటున్నా తనకన్నా షావుకార వరదయ్యగారికి కాంగ్రెను టిక్కెట్టు ఇచ్చారు, గనక రంగయ్య కాంగ్రెసును వదలివేశాడు ఇందులో తప్పేముంది? అయినా కాంగ్రెసులో ఇంకో మురావాళ్లు అవసరం వస్తే తనకి ఏదో టిక్కెట్టు ఇప్పిస్తామంటున్నారు కూడా పేదవాళ్లకి తనమీద వున్న అభిమానం చూసి సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ తనని వాళ్ల పార్టీలో చేరమంటున్నా తనకి ఇష్టంలేక చేరలేదంటాడు రంగయ్య. అయినా ఈ ఎర్రజండాల పార్టీల్లో చేరితే పోలీసోళ్లుకూడా తనకి పలకరు ఇక పేదవాళ్లకి తనేం సాయం చెయ్యగలడు? అందుకనే రంగయ్య ఏ పార్టీ లేకుండా స్వతంత్రంగా-అంటే పేదవాళ్ల పార్టీగా-వుంటూ వస్తున్నాడు

ఏపార్టీ తనకి ''తిక్కట్టు'' ఇవ్వనందువల్ల ''సొతంత్రం''గా రంగయ్య నామినేషన్ వేశాడు ఎలెక్షనుకి ఇక చూసుకొండి మజా! జిల్లాలో వున్న పెద్దలందరూ రంగయ్య ఇంటికి కార్ల మీద తిరిగారు ఎంత గొప్పోడు కాకుంటే రంగయ్య దగ్గిరకి ఈ కార్లంతా వస్తాయి అని వాళ్ల హరిజన వాడలో వాళ్లంతా అనుకున్నారు. ఆయనెవరో మంత్రిగా వుండేవారట!

ఆయనకూడా వచ్చారు రంగయ్య కోసం! "కాంగ్రెసు వచ్చిం తర్వాత అరిజనులకు ఎంత గౌరవం వచ్చేసిందీ" అనుకున్నారు అంతా.

ఆ వచ్చిన పెద్ద మనుషులంతా కాంగ్రెసుకు పోటీ నిలవ్వొద్దని రంగయ్యను అడిగారు అందులో ఒకాయన అన్నాడు కూడా, రంగయ్యకు ఏం బలం వుందని ఈ ఎలెక్షనులో కాంగ్రెసుకు పోటీ చేస్తున్నాడని రంగయ్యకు చాలా కోపం వచ్చింది తన కులంవాళ్లు— అంటే 'అరిజనులు" ఎన్నివేల వోటర్లు వున్నారో అందరూ ఒక్క వోటుకూడా పక్కకి పోనివ్వరని సమాధానం ఇచ్చాడు కాకుంటే కులంవాళ్లు కులంవాళ్లకి ఇవ్వక—అందులోనూ పేదోడు తనకివ్వక—ఈ ఘరానా పెద్దమనుష్యులకి ఇస్తారుట! పాపం! వాళ్ల అమాయకత్వానికి రంగయ్యకు నవ్వుకూడా వచ్చింది రంగయ్య ససేమిరా పోటీ మానుకోనన్నాడు ఆ నాడు షావుకారు వరదయ్యకి టిక్కెట్టు ఇచ్చి పేదోళ్ల నంతా అవమానంచేసిన కాంగ్రెసు మీద పోటీ పెట్టాల్సిందే అన్నాడు సుబ్బారాయుడు కూడా

మరుపటి రోజు కాంగ్రెసులో ఇంకో 'గ్రూపు' వాళ్లట—రంగయ్య దగ్గరకొచ్చి పోటీ మానుకో వద్దన్నారు. వాళ్లూ రంగయ్యా ఏం మాట్లాడు కొన్నారో తెలీదు కాని రంగయ్య మాత్రం వాళ్లు వెళ్ళిపోయినంతర్వాత చాలా హుషారుగా కని పించాడు

ఎలెక్షను ప్రచారంలో ఈ ఎర్రజండాల వాళ్లంతా పేదోళ్లకి భూములు పంచుతామం టుంటే తన కులంవాళ్లు అంతా నమ్మేస్తున్నా రని రంగయ్యకు చాలా బాధ కలిగింది. తనూ చెప్పాడు వాళ్లకు, "పిచ్చోళ్లారా! ఎన్ని కోట్ల మంది మనం వున్నాం ఎన్ని లచ్చల ఎకరాలు అయితే మాత్రం మనకి జానెడు భూమి వస్తుంది అంతా బూటకంరా నాయాల్లారా!" అని

ఎలెక్షను అయిపోయింది పాపం రంగయ్యకు డిపాజిట్టుకూడా రాలేదు తన కులం వోటర్లంతా వేసినా రంగయ్య గెలిచుండాలి, కాంగ్రెసూ సోషలిస్టుల మధ్య అయినా డిపాజిట్టు రాలేదు రంగయ్యకు పాపం ఆ వూరి వాళ్లంతా విచారించారు రంగయ్య ఓటమికి.

ఎలెక్షను అయిపోయిన వెంటనే రంగయ్య నాలుగెకరాలు భూమికొని సుబ్బారాయుడికి కౌలుకిచ్చాడు రంగయ్య ఎలా సంపాయించాడా అని అందరూ ఆశ్చర్యపడుతూంటారు. పోటీ గ్రూపు వాళ్లు రంగయ్యని పోటీ చెయ్యమని డబ్బుకూడా ఇస్తే, అది కాస్తా మిగిలించుకొని భూమి కొన్నాడని కిట్టనివాళ్లు ప్రచారం చేస్తున్నా రంగయ్య మళ్లీ ఎలెక్షను ఎప్పుడా అని చూస్తున్నాడు ★

---

భారతదేశంలో పార్లమెంటరీ ప్రభుత్వం, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు, ప్రతిపక్షమూ, పటిష్టమైన పత్రికా స్వాతంత్ర్యమూ వంటి సాధనాలు ఉండటంచేత ప్రజాస్వామ్యం విలసిల్లటానికి మిగతా ఆసియా దేశాలన్నిటికంటే ఇండియాలోనే ఎక్కువ అవకాశాలు కలవని కాలిఫోర్నియా రాజకీయ శాస్త్రవేత్త ఒకరు తన అభిప్రాయం వెలిబుచ్చారు.

కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ విండ్ మిల్లర్ ఇండియాలో ప్రభుత్వమూ, రాజకీయాలు అనే విషయాలను పరిశీలించటానికై 2 సంవత్సరాలపాటు ఉండి ఇటీవలనే అమెరికా తిరిగి వచ్చారు. ఆయన పసిఫిక్ కాలేజీ విద్యార్థుల సమావేశంలో జనవరి స్నాతక సభ సందర్భంలో ప్రసంగిస్తూ పైవిధంగా పేర్కొన్నారు.